

మంత్రి కేశవ్‌ను సత్కరించి ఆహ్వానిస్తున్న కర్ణాటక ప్రభుత్వ ప్రతినిధులు

# తుంగభద్రా డ్యామ్ నూతన గేట్ల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ కు ఆహ్వానం

**రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన కర్ణాటక ప్రభుత్వ ప్రతినిధులు**

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**

కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయానికి నూతనంగా అమర్చిన గేట్ల ప్రారంభోత్సవం ఈనెల 25వ తేదీన పెరుగుతుందని కార్యక్రమానికి విచ్చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి కేశవ్ ను కర్ణాటక ప్రభుత్వ ప్రతినిధులు ఆహ్వానించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం మంత్రిని కలిసిన కర్ణాటక ప్రభుత్వం తరపున శాసనసభ్యులు బసవరాజు, రాజారెడ్డి, శాసనమండలి సభ్యులు బసవన్న గౌడ, బసవరాజు ఈ మేరకు ఆహ్వానించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 23 జూన్ 2026 పేజీలు : 04


## యోగాంధ్ర రాష్ట్ర స్థాయి విజేతను అభినందించిన ఎస్పీ



విజేతను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

**అనంతపురం క్రైమ్ జూన్ 22 ప్రభాతవార్త**

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర-2026 కార్యక్రమంలో అనంతపురం జిల్లా యోగ క్రీడాకారుడు, డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ అనంతపురంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఎం. చలపతి విశిష్ట ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన ఆయనను జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు. ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఈయన జూన్ 18, 19 తేదీలలో విజయవాడ సమీపంలోని గుంటుపల్లి డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీలలో పాల్గొని సీనియర్ విభాగం సోలో యోగాసన పోటీల్లో తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. గత సంవత్సరం యోగాంధ్ర-2025 పోటీలలో కూడా పాల్గొని తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే 2025 సంవత్సరంలో విశాఖపట్నంలో ప్రధాని మోదీ సమక్షంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో యోగా ప్రోటోకాల్ ప్రదర్శనలో పాల్గొనడం విశేషం. ఈయన యోగా రంగంలో విశేష సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ నిర్వహించే వివిధ యోగా పోటీలలో పాల్గొని ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతున్నారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన అనంతరం జూన్ 21న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో ఆయనకు ప్రత్యేక స్థానం కల్పించారు. సీ ఎం, యోగా గురువు బాబా రాందేవ్, మంత్రుల సమక్షంలో నిర్వహించిన యోగా ప్రోటోకాల్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది. ఈ సందర్భంగా మంత్రులు స్వయంగా విజేతలను అభినందించి వారి ప్రతిభను కొనియాడారు.









# రెండు నెలల చిన్నారికి ప్రాణాంతక వ్యాధి

## - వ్యాక్సిన్ ఖరీదు రూ.17 కోట్లు

### - బిడ్డను కాపాడుకోవడానికి తల్లిదండ్రుల అవస్థ వర్ణనాతీతం - ఆదుకోవాలని దాతలకు వేడుకోలు

**తాడిపత్రి అర్బన్, జూన్ 22 ప్రభాతవార్త**

**కన్నబిడ్డ పుట్టిన ఆనందం...ఆ ఇంట్లో ఇంకా రెండు నెలలు కూడా నిలవలేదు. అప్పుడే విధి ఆ కుటుంబంపై క్రూరమైన పరీక్ష పెట్టింది. ఊయల్లో హాయిగా ఆడుకోవాల్సిన పసికందు... ఇప్పుడు ఆసుపత్రి మంచంపై ప్రాణాలు కాపాడుకోవడం కోసం పోరాడుతోంది. కోట్ల మందిలో ఒక్కరికి మాత్రమే వచ్చే అరుదైన వ్యాధి ఆ చిన్నారిని పట్టిపీడిస్తోంది. బిడ్డను కాపాడుకోవాలంటే 17 కోట్ల విలువైన ఇంజక్షన్ వేయాలని వైద్యులు చెప్పడంతో ఆ తల్లిదండ్రుల కళ్లల్లో కన్నీళ్లు ఆగడం లేదు. తమ ఆశల దీపాన్ని కాపాడాలని దాతలను వేడుకుంటున్నారు.**



అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ హృదయ విదారక ఘటనపై ప్రత్యేక కథనం. ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై కనిపిస్తున్న ఈ పసికందు పేరు ఇంకా సరిగా పిలవడం కూడా మొదలు కాలేదు. కానీ ఆ చిన్నారి జీవితంలో అప్పుడే పెద్ద పోరాటం మొదలైంది. పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి, ఇందుప్రియ దంపతులకు రెండు నెలల క్రితం బాబు జన్మించాడు. కొడుకు పుట్టాడనే ఆనందంలో ఆ కుటుంబం మునిగిపోయింది. భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్నారు. కానీ ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. నెల రోజుల వయసు వచ్చినా చిన్నారి కాళ్లు సరిగా కదపకపోవడం, ఇతర పిల్లల్లా చురుకుగా లేకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించగా మెరుగైన పరీక్షల కోసం హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. డాక్టర్ల సూచనల మేరకు హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులకు అక్కడ వైద్యులు ఊహించని విషయం చెప్పారు. పరీక్షల్లో చిన్నారికి స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ-ఎస్ఎంఎస్ టైప్-1 అనే అత్యంత అరుదైన జన్యుపరమైన వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ప్రాణాంతక వ్యాధి కారణంగా శరీరంలోని కండరాలు క్రమంగా బలహీనపడతాయి. మొదట చేతులు, కాళ్లు పనిచేయడం తగ్గిపోతుంది. ఆ తర్వాత శ్వాస తీసుకోవడానికి ఉపయోగపడే కండరాలు కూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే చిన్నారి చేతులు, కాళ్లు బలహీనపడుతున్నాయని, చికిత్స ఆలస్యం అయితే పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేశారు. అయితే ఈ వ్యాధికి ఆశాకిరణంగా ఉన్న ప్రత్యేక ఔషధ ఇంజక్షన్ ధర వింటే ఎవరికైనా గుండె భారమవుతుంది. ఆ ఒక్క ఇంజక్షన్ విలువ ఏకంగా 17 కోట్లు. రోజువారీ కష్టపడి జీవనం సాగించే ఈ కుటుంబానికి అంతటి భారీ మొత్తాన్ని సమకూర్చడం అసాధ్యంగా మారింది. ఒకవైపు కన్నబిడ్డ ప్రాణాలను కాపాడుకోవాలనే ఆవేదన... మరోవైపు కోట్ల రూపాయల వైద్య ఖర్చు. ఈ రెండింటి మధ్య ఆ తల్లిదండ్రులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆసుపత్రి మంచంపై అచేతనంగా పడుకున్న తమ బిడ్డను చూస్తూ రోజులు గడుపుతున్నారు. ఇదే విషయాన్ని తల్లిదండ్రులు తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డికి వివరించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, చికిత్సకు అవసరమైన భారీ ఖర్చు గురించి తెలుసుకున్న వారు వెంటనే స్పందించారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, చిన్నారికి అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం.



ఆవేదనలో తల్లిదండ్రులు

**మా బిడ్డను కాపాడండి :**

మా వల్ల అయ్యేంత వరకు ప్రయత్నిస్తున్నాం. కానీ 17 కోట్లు సమకూర్చడం మా శక్తికి మించిన విషయం. దాతలు, సేవా సంస్థలు, ప్రభుత్వాలు స్పందించి మా కుమారుడికి జీవితం ఇవ్వాలని పసికందు తల్లిదండ్రులు కోరుతున్నారు. కన్నీళ్లతో గడుస్తున్న ప్రతి క్షణం ఆ తల్లిదండ్రులకు యుగంలా మారుతోంది. తమ కుమారుడు మళ్లీ ఆరోగ్యంగా నవ్వుతూ, ఆడుకుంటూ కనిపించాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. పుట్టి రెండు నెలలు కూడా కాకముందే ప్రాణాల కోసం పోరాడుతున్న ఓ పసికందు... ఆ బిడ్డను కాపాడేందుకు చేతులు చాచి సహాయం కోరుతున్న తల్లిదండ్రులు... ప్రజాప్రతినిధులు స్పందించిన నేపథ్యంలో ప్రభుత్వం, దాతలు, సేవా సంస్థలు ముందుకు వస్తేనే ఈ చిన్నారి జీవితంలో మళ్లీ వెలుగులు నిండే అవకాశం ఉంది. మరి మనసున్న దాతలు ముందుకు వచ్చి ఈ ఆశల దీపాన్ని ఆరిపోకుండా కాపాడతారో లేదో చూడాలి. ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న ఈ చిన్నారి కథ ప్రతి ఒక్కరి హృదయాన్ని కలిచివేస్తోంది. సకాలంలో సహాయం అందితేనే ఈ పసికందుకు కొత్త జీవితం దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వం, దాతలు స్పందించి ఈ చిన్నారికి అండగా నిలవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## డిప్లమా ఇంజనీర్ల సంఘం వారికి అన్యాయం జరిగితే ధర్నా చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఇంజనీరింగ్ శాఖ సంఘం అధికారులు

**అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త బ్యూరో**

డిప్లమా ఇంజనీర్ల సంఘం వారికి అన్యాయం జరిగితే ధర్నా చేస్తాం అని సంఘం వైస్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాబావలి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ కృష్ణ, జిల్లా జనరల్ సెక్రెట్రీ కిషోరకుమార్, జిల్లా ఫైనాన్స్ సెక్రెట్రీ హుసేనాభాష్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు వివిధ ఇంజనీరింగ్ శాఖలలో ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేయాలని సరైన పేస్కేల్ వర్తింపజేయాలని అజండాలో ఉన్నదన్నారు. అయితే దానికి భిన్నంగా డిప్లమా ఇంజనీర్లకు వ్యతిరేకంగా సిఫారసులు ఉన్నాయని ఆరోపించారు. ఏపి ఈఎన్‌సి ఇటువంటి ఏకపక్ష నిర్ణయం వలన చాలామంది ఐటిఐ డిప్లమా విద్యార్థులు ఉన్న వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతాయి డిప్లమా విద్యార్థులు భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుంది అన్నారు. కేవలం గ్రాజివిటీ ఇంజనీర్లకు మాత్రమే పదోన్నతులు కల్పించాలని ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారు. పైవిధంగా డిప్లమా ఇంజనీర్ల సంఘం వారికి జరుగుతున్న అన్యాయాన్ని ధర్నా రూపంలో 19వ తేదీన తెలియజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ఇంజనీరింగ్ సంఘం అనవసరంగా జోక్యం చేసుకొని డిప్లమా ఇంజనీర్లకు జరుగుతున్న అన్యాయాన్ని కాపాడుకునే ప్రయత్నంలో అభ్యంతరాలు తెలుపుతున్నారన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో డిప్లమా ఇంజనీర్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్లు ఎవరికైనా అన్యాయం జరుగుతున్నప్పుడు వారికి సంబంధించిన సంఘాలు పోరాడుతుంటాయి. ఒక్కొక్క సారి రెండు సంఘాలు కలిసి సమిష్టిగా కూడా పోరాడుతాయి అది గమనించుకోవాలి మొన్న జరిగిన ధర్నాలో ఇంజనీర్స్ అసోసియేషన్ గురించి గానీ వారి నాయకుల గురించి గానీ రిటైర్డ్ అయిన పూర్వక నాయకుల గురించి గానీ ఎవరి గురించి గానీ మేము మాట్లాడలేదు అది గమనించాలని కోరుచున్నాము. అనంతపురం జిల్లా గ్రాజువీట్ సంఘం చేసిన ఆరోపణలను వారు ఖండించారు. భవిష్యత్తులో ఎలాంటి సమిష్టి పోరాటాలకైనా మాతో కలిసి రావాలని కోరారు.

# హాజరు కరవు..సేవలు బరువు..!

## - సచివాలయాల సేవలు దుర్భరం
## - పర్యవేక్షణ లేక...ప్రజాసేవలు అందక..!




నిర్లక్ష్యానికి నిలయం..ఈ సచివాలయం



గోడలమీద హోదా రాతలే..విధుల్లో కోతలే



చేతి సంచులు దర్శనమిస్తున్న సచివాలయ కార్యదర్శి గది



11 గంటలైనా తెరచుకోని చీమలవాగుపల్లి సచివాలయ తలుపులు

**తాడిపత్రి, జూన్ 22, ప్రభాతవార్త**

ప్రభుత్వ పథకాలు, సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థ నిర్లక్ష్యపు నీడలో కునుకు తీస్తోంది. ఎక్కడో మండలానికి దూరంగా మారుమూల గ్రామాల్లోని

సచివాలయాలు కాదు, ఎంపీడీవో, ఈవోఆర్డీ కార్యాలయాల పక్కనే ఉన్న సచివాలయాల్లోనూ సిబ్బంది హాజరు వారి సేవలను

వెక్కిరిస్తోంది. యాడికిలోని 3వ సచివాలయంలో సేవలు పొందడానికి వచ్చిన ప్రజలకు గోడలకు రాసిన సిబ్బంది హోదాలు, వారికి కేటాయించిన ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. పంచాయతీ కార్యదర్శి గదిలోని బల్లపై సిబ్బందికి చెందిన చేతి సంచులు మాత్రం కనిపించాయి. ఇలాంటి పరిస్థితిపై పర్యవేక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజా సేవలను గాలికి వదిలేశారని జనం ఆరోపిస్తున్నారు. అడిగేవారు లేరని ప్రజలకు సమాధానం చెప్పడంలోనూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని, ఇక్కడ అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంలో ఉన్నామంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని జనం విమర్శిస్తున్నారు. యాడికి మండలంలోని 16 సచివాలయాల్లోనూ ఇదే దుర్భర పరిస్థితి అని ఆయా గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి సచివాలయ తలుపులు 11 గంటలైనా తెరచుకోవడంలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సచివాలయ వ్యవస్థపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.


**అనుమతులు 7వ తరగతి వరకే..**

**కార్పోరేట్‌కు కట్టబెట్టేందుకే ఆర్టిసి ప్రైవేటీకరణ యత్నాలు**

**రైతుల ఆత్మహత్యలు కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనం**

**పల్స్ పోలియోను విజయవంతం చేయండి**

4 >>




యోగేంద్ర పాల్గొన్న విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా కలెక్టర్

## యోగాంధ్ర రాష్ట్ర స్థాయి విజేతలకు అభినందనలు

**అనంతపురం కలెక్టరేట్ జూన్ 22 ప్రభాతవార్త**

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర-2026 కార్యక్రమంలో అనంతపురం జిల్లా క్రీడాకారులు విశిష్ట ప్రతిభ కనబరిచారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన యోగాంధ్ర విజేతలు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ గారిని కలువగా.. యోగాంధ్ర విజేతలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 15, 16, 17 తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో ప్రథమ స్థానాలు సాధించిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అనంతరం జూన్ 18, 19 తేదీలలో విజయవాడ సమీపంలోని గుంటుపల్లి డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీలలో అనంతపురం జిల్లా నుంచి 18 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వారిలో ఆరుగురు విజేతలుగా నిలిచి జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో చాటారు.

ఫోటోగ్రఫీ పోటీలు , వరుణవి : ప్రథమ స్థానం, స్లోగన్ పోటీలు , గోపాలం గిరిధర్ : ద్వితీయ స్థానం, క్విజ్ పోటీలు డాక్టర్ సృజన : ప్రథమ స్థానం స్లోగన్ పోటీలు భావన రసజ్ఞ : తృతీయ స్థానం, సోలో యోగాసన పోటీలు ఎం. చలపతి : తృతీయ స్థానం, యోగా పాటల పోటీలు ఎ. లక్ష్మీనారాయణ తృతీయ స్థానం, జిల్లా స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించి, ప్రతిభావంతులైన పోటీదారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి విజయవాడకు తీసుకెళ్ళి, వారు బహుమతులు సాధించేలా ప్రోత్సహించినందుకు యోగాంధ్ర అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ జి.రామకృష్ణారెడ్డిని, యోగాంధ్ర పోటీల ఇన్‌చార్జ్ మరియు ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ కుమార్ ని, ఆయుష్ విభాగానికి చెందిన యోగా మాస్టర్ కృష్ణవేణిని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

# కూటమి నేతల మధ్య ఘర్షణ వైసీపికి ఆపాదించడం సరికాదు...

## మెట్టు గోవింద్ రెడ్డి

**రాయదుర్గం జూన్ 22 ప్రభాతవార్త**

రాయదుర్గం పట్టణంలో గత ఆదివారం సాయంత్రం అధికార కూటమి నాయకుల మధ్య జరిగిన దాడులను వైసీపీకి ఆపాదించడం సరికాదని రాయదుర్గం వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు నియోజకవర్గంలో శాంతి భద్రతల వైఫల్యం కనిపిస్తుందని ఆయన ఆరోపించారు ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లికి చెందిన భైరవానితిప్ప ప్రాజెక్టు సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు, టీడీపీ నేత బుడిమేపల్లి సుభాన్, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అనుచరుడిగా ఉండి చాలా కాలం క్రితమే వైసీపీని వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్న బోరువెల్ నాగిరెడ్డి మధ్య జరిగిన గొడవను వైసీపీకి అంటగట్టేందుకు అధికార పార్టీ నాయకులు కుట్రలు చేయడం సరికాదన్నారు .బోరువెల్ నాగిరెడ్డికి వైసీపీతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. "ఆయన చాలా కాలం క్రితమే బీజేపీలో చేరిన విషయం మీడియాకు తెలుసు కదా అని నిలదీశారు. ఈ సంఘటన పూర్తిగా కూటమి నాయకుల మధ్య అంతర్గత విభేదాలతో జరిగిన ఘర్షణ అని తెలిసినా, వైసీపీపై బురద చల్లడం వారి నైతిక దిగజారుడుకు అద్దం పడుతోందన్నారు. నాగిరెడ్డిని వైసీపీ నేతగా చిత్రీకరించడం సరికాదని వారికి హితవు పలికారు.

# ప్రశాంత వాతావరణంలో మొహరం వేడుకలు

**డి.హిరెహాళ్ జూన్ 22 ప్రభాతవార్త**



మొహరం అనుమతి కోసం వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎలాంటి గొడవలకు తావివ్వకుండ ప్రశాంత వాతావరణంలో మొహరం వేడుకలు జరుపుకోవాలని ఎస్.ఐ. గురుప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం డి.హిరెహాళ్ మండలం ఎం.హనుమాపురం గ్రామానికి చెందిన మొహరం పండుగ సందర్భంగ గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న మొహరం కమిటీ సభ్యులు పండుగ జరుపుకునేందుకు అనుమతి కోసం రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సేవ కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళి రాజుతో కలిసి ఎస్.ఐ. కు వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో ఎస్.ఐ. మాట్లాడుతూ మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, మద్యం సేవించిన వ్యక్తులు అగ్ని గుండం వద్దకు రాకుండా కమిటీ సభ్యులు తగిన తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు గుండం సమీపానికి రాకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తగిన సూచనలు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మొహరం వేడుకలు జరుపుకోవాలని ఆయన తెలిపారు. మొహరం వేడుకల సందర్భంగా ఏవైనా అనుకోని సంఘటనలు, ప్రమాదాలు సంభవిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఆయన కమిటీ సభ్యులకు చెప్పారు. ప్రజలు మొహరం వేడుకలను ఆస్వాదించాలని ఎలాంటి ఘర్షణలకు చోటు కల్పించకుండ పంతాలు, పట్టింపులు విడనాడి ఇతర ప్రాంతాల నుంచి మొహరం వేడుకలు తిలకించేందుకు వచ్చిన వారితో సఖ్యంగా మెలుగుతూ నిబంధనలు పాటిస్తూ మొహరం వేడుకలు జరుపుకోవాలని ఆయన తెలిపారు. మొహరం వేడుకల సందర్భంగా అగ్నిగుండం కోసం పచ్చని చెట్లు కొట్టకుండ, ఎండిన చెట్లను మాత్రమే తెచ్చి గుండంకు సమర్పించుకోవాలని నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్.ఐ. ఈ సందర్భంగా హెచ్చరికలు జారీ చేశారు. మండల పరిధిలోని డి.హిరెహాళ్, మలపడగుడి, హెచ్. సిద్దాపురం, ఓబులాపురం, కాదలూరు, గొడిసెలపల్లి, కుడ్లూరు, పులకుర్తి, వసగుడం, హాడగలి తదితర గ్రామాల్లో మొహరం వేడుకలు నిర్వహిస్తారన్నారని ఎక్కడ మొహరం పండుగ సందర్భంగా గొడవలు లేకుండా వేడుకలు జరుపుకోవాలని ఎస్.ఐ.చెప్పారు. మొహరం వేడుకల సందర్భంగా ఎవరైనా కావాలనే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అలాంటి వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టి తగిన బుద్ధి చెబుతామని ఎస్.ఐ. ఈ సందర్భంగా హెచ్చరించారు.

# బస్టాండ్ నిర్మాణాన్ని ఆపాలంటూ తాసిల్దార్ కు వినతి

**బ్రహ్మసముద్రం జూన్ 22 ప్రభాతవార్త**



వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం ఎంపీ నిధులతో బస్టాండ్ నిర్మాణా న్ని పాత రెవిన్యూ కార్యాలయం దగ్గర నిర్మిస్తున్న బస్టాండ్ నిర్మాణాన్ని ఆపాలంటూ బ్రహ్మసముద్రం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సోమవారం పీజీఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తాసిల్దార్ సుమతి కి వినతి పత్రం అందించారు పాత తహసిల్దార్ కార్యాలయం పడగొట్టి వేరే కార్యాలయాలు కట్టాలంటే వెళ్లడానికి దారి లేకుండా దారికి అడ్డంగా బస్టాండ్ నిర్మాణాన్ని చేస్తున్నారని దానిపై విచారణ జరిపి వెంటనే నిర్మాణాన్ని ఆపి వేరేచోట బస్టాండ్ నిర్మాణం జరిగేలా చూడాలని తెలుగుదేశం కార్యకర్తలు అల్లా బకాష్. లోకేష్ తిప్పేస్వామి శివప్ప జయన్న శ్రీనివాసులు చంద్రన్న అర్జీ పై సంతకాలు చేసి పనులు ఆపాలని తెలిపారు.

# ఎంపీపీ పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు నిర్వహించండి

**- పీజీఆర్ఎస్‌లో తహశీల్దార్‌కు విన్నవించిన కాలనీ ప్రజలు**

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పట్టణంలోని 4వ వార్డులోగల చౌడేశ్వరి ఆలయం వెనుకవైపునగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు నిర్వహించాలని ఆ కాలనీ ప్రజలు విన్నవించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కాలనీ ప్రజలు మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు మోలక బాల రామాంజినేయులు ఆధ్వర్యంలో తహశీల్దార్ పి.జి.అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో 1,2 తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారని అక్కడ చదువు పూర్తి అయిన తరువాత 3వ తగరతి నుండి పిల్లలను కిలోమీటరు దూరంలో ఉన్న 9వ వార్డులోని సెంట్రల్ ప్రాథమిక పాఠశాల, 11వ వార్డులోని ఆంజినేయస్వామి ఆలయంవద్దగల ప్రాథమిక పాఠశాలలో చేర్చాల్సి వస్తోందన్నారు. ఏడేళ్ల వయసుగల పిల్లలను దూరంగా ఉన్న పాఠశాలల్లో చేర్చడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు పాఠశాలలకు వెళ్లి వస్తున్న సమయంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. కనుక 4వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలోనే 1 నుంచి 5 తరగతులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు లక్ష్మినారాయణ, మధుబాబు, రాజు, అన్వేష్, చంద్రకళ, నాగజ్యోతి, విజయ్, వాణి, ఎర్రిస్వామి, సంధ్య, ఎర్రిస్వామి, త్రిపుర, మల్లిక, లక్ష్మి, సిరి, రామాంజినేయులు, వరలక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పురం అభివృద్ధికి టిడిపి చేసింది శూన్యం

**దొంగ నోట్ల వ్యవహారంలో టిడిపి నాయకుడి పాత్ర**

**వైసిపి వేణురెడ్డి తీవ్ర ఆరోపణలు**

**హిందూపురం జూన్ 22 ప్రభాతవార్త**



మీడియాతో వేణురెడ్డి

మూడుసార్లు హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణను హిందూపురం ప్రజలు గెలిపించినందున ప్రతిరోజు మీరు ప్రజల కాళ్ళ మొక్కిన కూడా రుణం తీరదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దీపిక కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. టిడిపి పై, ఎమ్మెల్యే బాలయ్య పిఎ లపై తీవ్రస్థాయిలో వేణురెడ్డి విమర్శలు చేశారు. ఇటీవల జరిగిన కూటమి రెండేళ్ల పాలన విజయోత్సవ సభకు ఐదారు వందల మంది కూడా రాలేదని వారిలో జనసేన, బిజెపి వారే ఎక్కువగా ఉన్నారని, ఇది మీ పార్టీ పరిస్థితి అంటూ ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల కిందట హిందూపురంలో దొంగ నోట్ల వ్యవహారంలో పట్టుబడిన వారు టిడిపి ముఖ్య నాయకుడి అనుచరులని, దొంగ నోట్లు దొరికినప్పటికీ అధికార పార్టీ ప్రభావంతో టాయ్ నోట్లుగా మార్చి కేసును పక్కదోవ పట్టించారని ఆరోపించారు. ఇందులో లక్షలాది రూపాయలు ముట్టాయని అనుమానం వ్యక్తం చేశారు. పట్టణంలో 92.5 0 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో గతంలోనే వైసీపీ పాలనలో 60 కోట్లు ముఖ్యమంత్రి జగన్ మంజూరు చేశారని అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అప్పుడు పనులు చేయలేక పోయామన్నారు. దానికి అదనంగా మరో కొంత తెచ్చి ఇప్పుడు తామేదో ఘనత వహించినట్లు చెప్పుకుంటున్నారని, ముఖ్యంగా రైల్వే రోడ్డు నిర్మాణంలో నాసిరకం పనులు జరిగాయని అప్పుడే నెర్రెలు భారిందని చెప్పారు. హిందూపురంలో 30 మంది ఓటర్లు కూడా లేని ఆ సామాజిక వర్గానికి చెందిన వారే పిఎలుగా, ఎమ్మెల్యేగా ఇక్కడ పాలిస్తున్నారని అన్నారు. చిలకలూరిపేటకు చెందిన ఎమ్మెల్యే పిఎ స్వీపర్ గా మారాడని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. హిందూపురం అంటే బీసీలు మైనార్టీలకు చెందిన ప్రాంతమని అన్నారు. స్థానికంగా బాలయ్య ఉంటూ ప్రజలకు పాలన అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి: ఎస్సై నాగ మధు

**కనేకల్ జూన్ 22 ప్రభాత వార్త**



మాట్లాడుతున్న ఎస్ఐ నాగ మధు

కణేకల్ మండల వ్యాప్తంగా మొహరం వేడుకలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్సై నాగ మధు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎస్సై నాగ మధు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు, పల్లెలు, పట్టణాల్లో మొహరం ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరగాలని కోరారు.వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత బాధ్యతాయుతంగా వ్యవహరించి పరస్పర సామరస్యాన్ని కాపాడాలని, పోలీసుశాఖ జారీచేసే సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అలాగే అగ్నిగుండంలో పచ్చని చెట్లను నరికి వేయరాదని ఎండిన చెట్లను మాత్రమే వేయాలనికోరారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో మొహరం వేడుకలను విజయవంతంగా నిర్వహించి కణేకల్ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని ఎస్సై నాగ మధు కోరారు.

# ప్రతి ఫిర్యాదును పరిశీలించి న్యాయం చేస్తాం

## జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

**శ్రీ సత్యసాయి జిల్లా, జూన్ 22, ప్రభాతవార్త ప్రతినిధి**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

పి జి ఆర్ ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజలు అందించే ప్రతి ఫిర్యాదును పరిశీలించి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ప్రజల నుంచి మొత్తం 80, వినతిపత్రాలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అందిన వినతులను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి, చట్టబద్ధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వికలాంగులు, వృద్ధులను గమనించిన ఎస్పీ స్వయంగా వారి వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. వారి ఇబ్బందులను ఓపికగా విని, అవసరమైన సహాయం అందించే దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావచ్చని, అందిన ప్రతి వినతిపై న్యాయపరంగా స్పందిస్తూ బాధితులకు అండగా నిలుస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత, సీఐలు బొజ్జప్ప, లక్ష్మీకాంత్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్"




డ్రగ్స్ నియంత్రణ కు 1972 టోల్ ఫ్రీ నెంబర్ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**శ్రీ సత్యసాయి జిల్లా, జూన్ 22, ప్రభాతవార్త ప్రతినిధి**

పుట్టపర్తి లోని చిన్నంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్" క్రింద డ్రగ్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐజీపీ రవికృష్ణ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జిల్లా ఎస్పీ మహేశ్వర రాజు, ఈగిల్ ఎస్పీలు నగేష్ బాబు, స్వరూప రాణి ఆదేశాల మేరకు సోమవారం పుట్టపర్తి పట్టణంలోని చిన్నపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈగిల్ ఎస్ఐ శ్రీహరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ముఖ్యంగా గంజాయి వంటి మత్తు పదార్థాల వలన శారీరక, మానసిక ఆరోగ్యాలపై పడే ప్రభావాలు, విద్యాభ్యాసం, భవిష్యత్ జీవితంపై ఏర్పడే ప్రతికూల పరిణామాల గురించి వివరించారు.అలాగే ఎన్‌డీపీఎస్ చట్టంకింద మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసుల్లో ఇరుక్కుంటే ఎదురయ్యే చట్టపరమైన చర్యలు, శిక్షలు, వాటి వల్ల కలిగే ఇబ్బందులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి, కుటుంబం మరియు సమాజంపైచూపే ప్రతికూల ప్రభావాలను వివరించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలని సూచించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు, ఇతరులను కూడా వాటి నుంచి దూరంగా ఉంచేలా చైతన్యం కల్పించారు.గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, నషా ముక్త్ భారత్ అభియాన్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వీపర్ కాదు కేర్ టేకర్

**ఆరోపణలను నిరూపించండి - టిడిపి సవాల్**



విలేకరులతో టిడిపి నాయకులు

**హిందూపురం టౌన్ జూన్ 22 ప్రభాతవార్త**

ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలతో హిందూపురం నియోజకవర్గం పొలిటికల్ కోఆర్డినేటర్ గా వివరిస్తున్న శ్రీనివాసరావు స్వీపర్ కాదని నియోజకవర్గ కేర్ టేకర్ అని మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్ కుమార్ తనదైన శైలిలో స్పష్టం చేశారు. వైసిపి నాయకులు వేణు రెడ్డి తీవ్రస్థాయిలో టిడిపి పై, పియాలపై చేసిన విమర్శలకు కౌంటర్ గా తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. చిలకలూరిపేటలో శ్రీమంతుడైన శ్రీనివాసరావుకు ఇక్కడ అవినీతికి పాల్పడాల్సిన అవసరం లేదని, బాలయ్య, నారా లోకేష్ ఆదేశాలతో హిందూపురం అభివృద్ధి కోసం ఇక్కడికి వచ్చి పని చేస్తున్నారన్నారు. రైల్వే రోడ్డు 80 నుంచి 70 అడుగుల కు తగ్గించి వైసిపి మున్సిపల్ పాలనలోనే కౌన్సిల్లో తీర్మానం చేసింది గుర్తులేదా అంటూ ప్రశ్నించారు. బాల య్య స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ హిందూపురానికి 92.5 కోట్ల రూపాయలను తీసుకురాగా వైసిపి హయాంలోనే 60 కోట్లు తెచ్చామనడం పెద్ద జోక్ అంటూ కొట్టి పారేశారు. 201419 మధ్యలో బాలయ్య 66 కోట్ల రూపాయలను హిందూపురానికి తీసుకురాగా తదుపరి అధికారంలోకి వచ్చిన వైసీపీ దానిని ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టిందని విమర్శించారు. వైసిపి పాలనలో ఆ నిధులు విడుదలై ఉంటే జీవో కాపీ చూపించాలని అంటూ సవాల్ చేశారు. పట్టణ అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ బాలయ్య గురించి వేణు రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. పులివెందుల ఎమ్మెల్యే స్థానికంగా ఎక్కడ ఉంటున్నాడని ప్రశ్నించారు. అయితే బాలయ్య హిందూపురంలో పర్యటిస్తూ అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. మీ ప్రభుత్వ హయాంలో ఇసుక మాఫియాకు పాల్పడ్డావని విమర్శించారు. టిడిపి అధికార ప్రతినిధి యుగంధర్ మాట్లాడుతూ వేణు రెడ్డి చేసిన అవినీతి ఆరోపణలపై ఆధారాలు చూపించాలని సవాల్ చేశారు. ఉనికి కోసమే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. చిలకలూరిపేట స్వీపర్ పని చేసిన విమర్శలపై మాట్లాడుతూ వైసీపీ పాలనలో చేసిన గలీజ్ దందాలను ఆయన శుభ్రం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఇన్చార్జిగా ఉన్నప్పుడు ఇసుక మాఫియా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ్డారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. మాజీ కౌన్సిలర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ పాలన సౌలభ్యం కోసం బాలయ్య ఇక్కడ నలుగురు పర్యవేక్షిస్తున్నారని స్పష్టం చేశారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. సమావేశంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు పూలకుంట మంజునాథ్, ఎస్ ఎస్ అమర్నాథ్, బాచి, మండల కన్వీనర్ రాము, లేపాక్షి కన్వీనర్ అభి మొదలగు వారు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి ముందస్తు ఏర్పాట్లు



**బెలుగుప్ప జూన్ 22ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రోజున పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి ముందస్తు ఏర్పాట్లు చేశామని డాక్టర్ ప్రియాంక డాక్టర్ హిమబిందు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం జిల్లా కార్యదర్శి మల్లికార్జున తాసిల్దార్ అనిల్ కుమార్ మండల అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ తెలుగుదేశ మండల కన్వీనర్ సునీల్ పాల్గొని పల్స్ పోలియో చుక్కలు వేయడానికి 0,5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని 2862026 ఆదివారం నాడు నిండు ప్రాణానికి రెండు చుక్కలు వేయాలని తెలిపారు 2,3 రోజులలో ఇంటింటికి వెళ్లి సర్వే చేసి పోలియో చుక్కలు వేస్తాము ఈ సందర్భంగా అధికారులు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సలహాలు సూచనలు సూచించారు పోలియో బూతులు ఏర్పాట్లు మందుల నిలువ సిబ్బంది నియామకం అవగాహన కార్యక్రమాలు ఇంటింటి సర్వేలు తదుపరి అంశాలపై అధికారులకు దిశ నిర్దేశం చేశారు.మండలానికి సంబంధించిన మనకు టార్గెట్లో5017 పిల్లల సంఖ్య మూడు రూట్ల మొబైల్ టీమ్స్ 37 బూతులు బూత్ నెంబర్స్ 148 సభ్యులు పాల్గొనిఈ కార్యక్రమంలో పాల్గొని డాక్టర్ ఋషికేషు సూపర్వైజర్స్ పద్మావతి విజయ్ కుమార్ జాఫర్ వెంకటరమణ సరోజ అరుణ నాగమణి ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి నర్సులు లీలీబీశిలీ హెల్త్ అసిస్టెంట్లు అంగన్వాడి కార్యకర్తలు ఆశా వర్కర్లు పాల్గొనడం జరిగింది

# యోగాంధ్ర-2026 స్లోగన్స్ జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన టి.రజని కుమారి

**అభినందించి జ్ఞాపికను అందజేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ**



జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న టి.రజని కుమారి

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**

అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రం అనంతపురంలో నిర్వహించిన యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా జరిగిన యోగ స్లోగన్స్ జిల్లాస్థాయి పోటీలలో ఉరవకొండ పట్టణానికి చెందిన ఉపాధ్యాయురాలు టి.రజని కుమారి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా టి.రజని కుమారికు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ జ్ఞాపికను అందించి అభినందించారు. యోగపట్ల అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన ఈ పోటీలలో ప్రతిభ కనపర్చడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కాగా జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ టి.రజని కుమారిను ఒక ప్రకటనలో అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# యోగాంధ్ర-2026 పోటీల విజేతలకు కలెక్టర్ ఓ.ఆనంద్ అభినందనలు

**-యోగ క్విజ్‌లో పోటీల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన డాక్టర్ తాటికొండ సృజన -యోగా స్లోగన్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం పొందిన 8వ తరగతి విద్యార్థి గోపాలం గిరిధర్**



డాక్టర్ తాటికొండ సృజనను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**

అంతర్జాయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించిన యోగాంధ్ర-2026 రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజేతలను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అభినందించారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనంద్ యోగ క్విజ్‌లో పోటీల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన డాక్టర్ తాటికొండ సృజన, యోగా స్లోగన్‌లో రా ష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం పొందిన ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి గోపాలం గిరిధర్‌ను అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత రాణించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు నిస్వార్థ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



గోపాలం గిరిధర్‌ను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

# పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

**-ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రిఫ్ అలీ**

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**



విలేఖరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.అశ్రిఫ్ అలీ

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ కె.అశ్రిఫ్ అలీ తెలిపారు. సోమవారం ఆయన కళాశాల సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాల శాఖాధిపతులు డాక్టర్ సులోచన, డాక్టర్ నరసింహారెడ్డి తో కలిసి విలేఖరులతో మాట్లాడారు. అర్హత కల్గిన అభ్యర్థులు ఈనెల 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు అన్‌లైన్‌లో ఫీజు చెల్లించి ఆన్‌లైన్ లేదా హెల్ప్‌లైన్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకొని తమ సరి ్టఫికేట్లను వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. షెడ్యూల్‌లో భాగంగా 24 నుంచి 30 వరకు ఆన్‌లైన్ సర్టిఫికేట్ వెరిఫికేషన్, ఫీజు చెల్లింపులు, 25నుంచి జూలై 1 వరకు హెల్ప్‌లైన్ సెంటర్‌లో సర్టిఫికేట్ల వెరిఫికేషన్, 29 నుంచి జూన్ 3వరకు వెబ్ ఆప్షన్స్ ఎంట్రీ, జూలై 6న సీట్ అలాట్‌మెంట్, జూలై7 నుంచి 10 వరకు కళాశాలలో రిపోర్టింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 700 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 250రూపాయలు ప్రాసెసింగ్ ఫీజుచెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆప్షన్స్ ఇవ్వడానికి ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, బెలుగుప్ప, కూడేరు మండలాల విద్యార్థుల కోసం చిన్నముష్టూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన అభ్యర్థులకు యశస్వి, ప్రగతి స్కాలర్‌షిప్‌లను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని, ప్రత్యేక బస్సు, హాస్టల్ వసతి షరతులకు లోబడి కల్పించబడుతుందన్నారు. ఇతర వివరాలు పాలిసెట్.ఎపి.జిఎవి.ఇన్ వెబ్‌సైట్‌లో లభిస్తాయని ప్రిన్సిపాల్ కె.అశ్రిఫ్ అలీ వివరించారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి ఎమ్మెల్యే రాజు




అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే రాజు

**మడకశిర టౌన్ జూన్ 22 ప్రభాతవార్త**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం పట్టణంలో ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సర్ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశిలించి వారికి పలు సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాదిగా నిలుస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అనర్హుల పేర్ల తొలగింపుపై కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు . ఈ సమావేశంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాయితీ విత్తన వేరుశనగ పంపిణి చేసిన కన్వీనర్



విత్తన పంపిణీ చేస్తున్న దృశ్యం

**బ్రహ్మసముద్రం జూన్ 22 ప్రభాతవార్త**

మండలకేంద్రంలోని వ్యవసాయ కాయలయం వద్ద సోమవారం ప్రభుత్వ రాయితీ వేరుశనగను మండల వ్యవసాయ అదికారి గోపాల్‌పంపిణి చేయడం జరిగింది ఈ కార్యక్రమంనకు ముఖ్య అతితులుగా కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు. జడ్‌పిటిసి ప్రభావతమ్మ హాజరయ్యారు ఈ సందర్భంగా కన్వీనర్ శ్రీ రాములు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వంరైతులకు నాణ్యమైనరాయితీ విత్తన వేరుశనగ పంపిణీ చేసిందని రైతులు సక్రమ్నమగా మీయొక్క పొలాలలో వేసుకోవసలని తెలియ చేసారు అనంతరం వ్యవసాయ అధికారి గోపాల్ మాట్లాడుతూ రైతులకు విత్తన వేరుశనగ తో పాటు ప్రాసిఫైడ్ కందులు పంపిణీ చేయడం జరుగుతుందని అవసరమైన రైతులు కందులు తీసుకోవాలని తెలిపారు అనంతరం ఈ ఖరీఫ్ సీజన్లో ఎలినినో ప్రభావం పై రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమం లో కన్వీనర్ శ్రీరాములు జడ్ పిటిసి ప్రభావతమ్మ. వ్యవసాయ అదికారి గోపాల్ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లిఖిత వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 10,700 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలి

## - ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి హనుమంతు రాయడు, కుల్లాయిస్వామిలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేస్తామని నేటికీ విడుదల చేయలేదన్నారు. రాష్ట్రం లో 11 లక్షల మంది ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థుల్ని ఫీజుల పథకానికి దూరం చేస్తున్న కూటమి సర్కార్ అని మండిపడ్డారు తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న అమ్మబడి పథకం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసింహ యాదవ్ వెంకట్ నాయక్ మంజునాథ్ చందు నాయకులు రాజు రాజేష్ హరికృష్ణ కరుణాకర్ మన్సూర్ సిద్ధిక్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గూగూడు బ్రహ్మోత్సవాల్లో అన్నదాన కార్యక్రమం

నార్పల, జూన్ 22 ప్రభాతవార్త


అన్నదానం చేస్తున్న వెంకట శివారెడ్డి

నార్పల మండలం గూగూడు గ్రామంలో జరుగుతున్న శ్రీ కుల్లాయిస్వామి బ్రహ్మోత్సవాలకు నార్పలకు చెందిన దాత శ్రీనివాస రైస్ మిల్ గూడపరెడ్డి వెంకటశివారెడ్డి గూగూడులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ కుళ్ళాయి స్వామి బ్రహ్మోత్సవాలు ఆరవ రోజు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలి వచ్చారు.

నార్పల శ్రీనివాస రైస్ మిల్ గూడపరెడ్డి వెంకట శివారెడ్డి కుటుంబీకులు ఉదయం నుండి సాయంత్రం వరకు వచ్చే అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్న దాన కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే ప్రతి ఏటా శ్రీ గూగూడులో కుళ్లాయిస్వామి భక్తులకు అన్నదానం చేయడం తనకు ఎంతో ఆనందం, భక్తుల ఆకలి తీర్చినందుకు సంతృప్తి ఉంటుందన్నారు.

# కూటమి పాలనలో అస్తవ్యస్థంగా విద్యా రంగం

## - పాఠశాలలు ప్రారంభమైనా విద్యాకానుక ఇవ్వలేరా..?

## - వైసిపి యువజన విద్యార్థి విభాగం నేతల విమర్శ


అర్థనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి యువజన విద్యార్థి విభాగం నేతలు

అనంతపురం సిటీ, జూన్ 22 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యా రంగం అస్తవ్యస్థంగా మారిందని, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్ మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగంపై నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ వైసిపి యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా నగరంలోని సంగమేష్ సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు అర్ధనగ్నంగా ప్రదర్శన చేసి కలెక్టరేట్ ఎదుట బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యువ జన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వైసిపి హయాంలో ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు అవసరమైన వాటిని విద్యా కానుక కిట్ల రూపంలో అందించే వారన్నారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, యూనిఫాంలు, నోట్ పుస్తకాల తోపాటు ఇతరాత్ర వాటిని అందించి విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. అయితే ఈ ఏడాది కూటమి ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా విద్యా కానుక ఇవ్వలేని అసమర్ధ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. విద్యాశాఖకు అసమర్థమైన మంత్రి ఉండటం వల్లే విద్యా వ్యవస్థ నిర్లక్ష్యంగా మారిందని మండి పడ్డారు. అంతేకాకుండా మౌలిక వసతులు కూడా కల్పించలేని దౌర్భాగ్యపు పాలన కొనసాగుతోందని మండి పడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేందర్రెడ్డిలతోపాటు యువజన విభాగం విద్యార్థి విభాగం నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉరవకొండ ప్రైవేట్ పాఠశాలలపై డిఆర్ఓకు ఫిర్యాదు

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త


డిఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా వైయస్సార్ విద్యార్థి విభాగం నేతలు ఉరవకొండ నియోజవర్గంలో ఉన్నటువంటి ప్రైవేటు స్కూళ్లపై డిఆర్ఓ మల్లోలకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గం అధ్యక్షులు సాకే పురుషోత్తం డిఆర్ఓతో మాట్లాడుతూ.. ఉరవకొండ నియోజకవర్గం లో ఉన్నటువంటి ప్రైవేట్ స్కూల్లో ఇష్టంసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. డొనేషన్, ఈ టెక్నో, ఐటిఐ, ఒలంపియాడ్ పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. కనీస మౌలిక వసతులు లేక పోయినా బిల్డింగ్ మీద బిల్డింగులు కట్టిస్తూ ఎటువంటి పర్మిషన్స్ లేకపోయినా విద్యాధికారులు రెన్యూవల్కు పర్మిషన్ ఇస్తున్నారన్నారు. అదేవిధంగా ఒక స్కూలు నడుపుతూ మరో స్కూలు మీద పర్మిషన్ తీసుకున్నటువంటి ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలపై వెంటనే కఠినర్ చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా ఉన్నత అధికారులను కోరారు. ఈ సమావేశంలో అనంతపురం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ నెంబర్ సాకే ముసలయ్య పాల్గొన్నారు.

# అమరావతి నూతన క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి గౌస్ మోద్దిన్ 1లక్ష విరాళం

## - బసవతారకం సేవా యజ్ఞానికి గౌస్ మోద్దిన్ ఆర్థిక సహాయం

## -ఎన్బీకే ఫ్యాన్స్ సేవా స్ఫూర్తికి బాలకృష్ణ ప్రశంసలు

అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త బ్యూరో


చెక్కును హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు అందజేస్తున్న దృశ్యం

హైదరాబాద్లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ 25 సంవత్సరాల సేవలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మించబోయే నూతన ఆసుపత్రి నిర్మాణానికి మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఎన్బీకే ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు గౌస్ మొద్దీన్ రూ.1 లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని హిందూపురం ఎమ్మెల్యే, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణకి స్వయంగా అందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ..అభిమానులు సేవా కార్యక్రమాల్లో ముందుండి సమాజానికి అండగా నిలవడం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా ఫ్యాన్స్ అసోసియేషన్ తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం అభిమానుల్లో సేవా స్ఫూర్తిని మరింత పెంపొందించేలా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు.

# ఎల్నినోపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది

.గార్లదిన్నె, జూన్ 22, ప్రభాత వార్త :

"రైతన్నా! మీకోసం" కార్యక్రమంలో భాగంగా బూదేడు, యర్ర గుంట్ల, కమలాపురం రైతు సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ రైతులకు ఎల్నినో ప్రభావం, పీఎండీఎస్ విధానంపై అవగాహన కల్పించారు. వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వరికి బదులుగా చిరు ధాన్యాలు, అపరాలు సాగు చేయాలని సూచించారు.

డ్రిప్, స్ప్రింక్లర్ వినియోగంతో పాటు ఫారం పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఏపీఏ ఐఎంఎస్ 2.0 యాప్లో నమోదు చేసుకుని వ్యవసాయ సేవలు పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఆంజనేయులు నాయక్, ఏఈఓ హరి, వీహెచ్ఏ శిరీష, నరేంద్ర, వీఏఏ అనూష, ఎంపీఈఓ ప్రభావతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మానస తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసంను సద్వినియోగం చేసుకోండి

## - మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్కుమార్


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శింగనమల, జూన్ 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో ఈ నెల 22 నుంచి 27వ తేది వరకు నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్కుమార్ తెలిపారు. సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, విఆర్ఓ, వెటరనరీ సిబ్బంది, ఫిషరీష్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్, గ్రామ ఎనర్జీ అసిస్టెంట్, పిఏసిఎస్, మార్కెటింగ్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మొత్తం మూడు బృందాలుగా, క్లస్టర్గా రోజుకు 30 క్లస్టర్స్ సందర్శించి ప్రస్తుత ఎల్నినో వాతావరణ పరిస్థితిపై అవగాహన, ప్రకృతి వ్యవసాయం ఏపిఏ ఐఎంఎస్ విధానంలో యూరియా, డిఏపి ఎరువుల అమ్మకాలు వంటి విషయాలను తెలియజేస్తారని, ఫార్మర్ యాప్ను ప్రతి రైతు డౌన్లోడ్ చేసుకోవడం, అందులోని ప్రయోజనాలు, అప్పియర్ రిజిస్ట్రేషన్, మిశ్రమ పంటల సాగు ఆవశ్యకత తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' గందరగోళం

## - బిఎల్ఓల్లో అవగాహన లోపం

## - ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేయటంలో ఓటర్లకు తప్పని తిప్పలు

పామిడి, జూన్ 22 ప్రభాతవార్త

ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' గందరగోళంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2002లో మీరు ఎక్కడ నివాసం ఉన్నారు.. ఏ పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.. మీ తల్లి దండ్రులు వారి తల్లిదండ్రుల పేర్లు ఏమిటి.. అంటూ ఇంటింటికి వెళ్తున్న బిఎల్ఓలు ఓటర్లను ప్రశ్నిస్తూ ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి 10 రోజుల్లో తిరిగి వస్తాం.. ఫారాలను సమగ్ర సమాచారంతో పూర్తి చేసి అందజేయాలని చెప్పటంతో వారంతా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎక్కడ నివాసం ఉన్నాం.. ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నామన్న వివరాలను తెలియజేయగలం కానీ 2002లో ఎక్కడ ఓటుహక్కును వినియోగించుకున్నామన్నది మాకెలా గుర్తుంటుందని పలువురు వాఖ్యానిస్తుండటం గమనార్హం.

బిఎల్ఓలకు ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన లోపంతో ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసి చేతులు దులుపుకుంటుండటంతో వాటిని సమగ్ర సమాచారంతో పూర్తి చేయటానికి ప్రజలకు తిప్పలు తప్పటం లేదన్నది పలువురి వాదన. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) అంటే ప్రత్యేక సమగ్ర వివరణ అని అర్థం. ఇది భారత ఎన్నికల సంఘం ఓటర్ జాబితాను శుద్ధి చేయటానికి సవీకరించటానికి చేపట్టే ఒక పెద్ద ప్రక్రియ కాగా మరణించిన, నకిలీ, శాశ్వితంగా వేరే ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించటం, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన నూతన ఓటర్ పేరును జాబితాలో చేర్చటం, ఓటర్ జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా పారదర్శకంగా సమగ్రంగా ఉండేలా చూడటం ద్వార దేశవ్యాప్తింగా ఓటర్ జాబితాను సరిచేసి పౌరులకు స్వేచ్ఛాయుతమైన ఓటు హక్కును కల్పించటం ప్రధాన లక్ష్యం కావటం ద్వార అధికారయంత్రాంగం ఈ ప్రక్రియను వేగవంతం చేసున్న విషయం అందరికీ తెలిసిందే. 2002 ఓటర్ జాబితాను ప్రామాణికంగా తీసుకుని చేస్తున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రతి ఓటర్ పూర్తి వివరాలను అందజేయాలని అధికారయంత్రాంగం ఆదేశిస్తున్న క్రమంలో ప్రతి ఇంటిని సందర్శిస్తున్న బిఎల్ఓలు 'సర్'పై అవగాహన కల్పిస్తూనే వివరాలను సేకరించాల్సిన అవసరం ఎంతైనావుంది.

# ఆటోను ఢీకొని బైక్ మెకానిక్ మృతి

గార్లదిన్నె, జూన్ 22, ప్రభాతవార్త :


ప్రమాదం లో మృతి చెందిన మోహన్ బాబు

పెద్దవడుగూరు మండలం రావులుడికి గ్రామానికి చెందిన మోహన్ బాబు (37) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మోహన్బాబు బైక్ మెకానిక్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం బైక్ విడిభాగాల కొనుగోలు కోసం అనంతపురానికి బైక్పై వెళ్తుండగా, గార్లదిన్నె మండలం కల్లూరు జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న ఆటోను గమనించక ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన మోహన్బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గార్ల దిన్నె పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం వేగవంతం చేయండి

## - తహశీల్దారు శేషారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు శేషారెడ్డి

శింగనమల, జూన్ 22 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో సోమవారం తహశీల్దారు శేషారెడ్డి, ఎంపిడిఓ భాస్కర్ మండల అధికారులతో జిల్లా కలెక్టర్తో వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. అనంతరం తహశీల్దారు శేషారెడ్డి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా పిజిఆర్ఎస్ అర్జీలు పెండింగ్ లేకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ విజయ్కుమార్, అక్బర్, మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్కుమార్, ట్రాన్స్కో ఏఈ సుదర్శన్రెడ్డి, తరిమెల పిహెచ్సి వైద్యాధికారి శంకర్నాయక్, ఉపాధి హామీ ఏపిఓ భాగ్య లక్ష్మి, మండల విద్యాధికారులు నరసింహరాజు, శివ ప్రసాద్, వెలుగు ఏపిఎం ఈశ్వరయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

## - మండల వ్యవసాయాధికారి శ్యామ్సుందర్రెడ్డి


రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాదికారి శ్యామ్సుందర్రెడ్డి

బుక్కరాయసముద్రం, జూన్ 22 ప్రభాతవార్త

రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్యామ్సుందర్రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిది లోని రైతుసేవా కేంద్రం పరిదిలో నిర్వహించే రైతన్నా మీకోసం కార్యక్రమం జూన్ 22 నుండి 27 వరకు నిర్వహింబడును. ఈ కార్యక్రమం కమిటీల ద్వారా నిర్వహించబడును కమిటీలో వ్యవసాయ సిబ్బంది, విఆర్ఓ, వెటర్నరీ సిబ్బంది. షిషరీష్ సిబ్బంది ,గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్,గ్రామ ఎనర్జీ అసిస్టెంట్, పిఎసిఎస్ మార్కెటింగ్ సిబ్బంది,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బృందాలుగా 3 గృహాలు ఒక క్లస్టర్గా రోజుకు 30 క్లస్టర్స్ సందర్శించి ప్రస్తుత ఎల్నినో వాతావరణ పరిస్థితి పైఅవగాహన,పిఎండిఎస్ (ప్రకృతి వ్యవసాయం) ఎపిఎఐఎంఎస్ విధానంలో యూరియా,డిఎపి ఎరువుల అమ్మకాలు,వరి పంటకి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలసాగు తోపాటు ఎఫ్ఆర్ఎంఇఆర్ ఎపిపిని ప్రతి రైతు డౌన్లోడ్ చేసుకోవడం అందులోని ప్రయోజనాలు, ఎపిఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ అంతర మిశ్రమ పంటలసాగు ఆవశ్యకత తదితిర విషయాల పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

# నారాయణ పేరుతో ఫీజుల వసూళ్లు?అక్షర పేరు

## నారాయణ పుస్తకాలు, యూనిఫాంలు.. తల్లిదండ్రుల్లో అయోమయం.

.గార్లదిన్నె, జూన్ 22, ప్రభాతవార్త :

గార్లదిన్నెలోని ఓ సీబీఎస్ఈ పాఠశాల వ్యవహారంపై కొందరు తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల బయట "అక్షర ఇంటర్నేషనల్ స్కూల్" పేరుతో నిర్వహణ కొనసాగుతుండగా, లోపల మాత్రం నారాయణ విద్యాసంస్థలకు సంబంధించిన పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రిని కొనుగోలు చేయాలని సూచిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రవేశాల సమయంలో ఒక పేరుతో ప్రచారం చేసి, అనంతరం మరో బ్రాండ్కు సంబంధించిన సామగ్రిని తప్పనిసరి చేయడం వల్ల తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొందని వారు పేర్కొంటున్నారు.

పుస్తకాలు, యూనిఫాంల పేరుతో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారంటూ కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సీబీఎస్ఈ నిబంధనలకు అనుగుణంగా పాఠశాల నిర్వహణ జరుగుతోందా? విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారా? అనే అంశాలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**పొలం డాక్యుమెంట్లు పోయినవి**

టి.రామచంద్ర, S/o టి.పెద్దసుబ్బరాయుడు, D.No.8-62-A, OC కాలనీ, కనగానపల్లి గ్రామం & మండలం, శ్రీ సత్యసాయి (జిల్లా), కనగానపల్లి రెవిన్యూ పొలం సర్వేనెం 127లో 25.18 ఎకరాలకు సంబంధించి డాక్యుమెంటు నెం. 629. ఇందులో 6.18 ఎకరాలు సంబంధించిన పొలం ఒరిజినల్ డాక్యుమెంట్లు మా గ్రామం సర్కిల్ నందు మోటార్ బైకులో 09.06.2026 తేదీ ఉదయం 9:00 గంటల సమయంలో ప్రయాణంలో పోగొట్టుకుపోయినవి. దీనిపై పోలీసు స్టేషన్ నందు కంప్లైంట్ ఇచ్చాను. వారు డాక్యుమెంట్లు మిస్సింగ్ అయినట్లు గా కేసు నమోదు చేశారు. ఎవరికైనా డాక్యుమెంట్లు దొరికినచో టి.రామచంద్ర, ఫోన్ నెం: 9010119604కు తెలియజేయగలరు. వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

**CHANGE OF NAME**

I, GANGALAKUNTA CHENAREDDY (old Name) S/O GANGALAKUNTA OBIREDDY, R/o 6-5-923, 80 FT Road, Beside Neerupragathi Park, RAM NAGAR, Anantapur, Ananthapuramu(D), AP-515004, I have changed my New name to **GANGALAKUNTA CHENNAREDDY**, hence forth I will be known as **GANGALAKUNTA CHENNAREDDY** (New name) **S/o GANGALAKUNTA OBIREDDY.**

# బీజేపీ చెప్పేవన్నీ నీతి సూత్రాలు..ఆచరించేవన్నీ తప్పుడు పద్ధతులు..!

## -మోదీ జమానాలో ఎంపీ, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులుకాదు పార్టీల విలీనాలే - ఎన్నికల్లో గెలవడానికి, అధికారంలో రావడానికి వందలు, వేలకోట్లు ఖర్చులు -అయోధ్యలో రామాలయం నిర్మాణంలో రూ.5వేల కోట్ల అవినీతి బయటికొస్తోంది -దేశాన్ని కాపాడాలని ఆగస్టు 6 నుండి 15 వరకు సీపీఐ దేశవ్యాప్త పాదయాత్రలు -భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ -ఉరవకొండలో మొదలైన సీపీఐ పార్టీ జిల్లా రాజకీయ వైజ్ఞానిక శిక్షణా తరగతులు



రాజకీయ వైజ్ఞానిక శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ



శిక్షణా తరగతుల ప్రారంభంలో పార్టీ జండాను ఆవిష్కరిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు గెన్నే మల్లేసి



ప్రజా నాట్య మండలి కళాకారుల ప్రదర్శన దృశ్యం

ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త

బీజేపీ, మోదీ చెప్పేవన్నీ నీతి సూక్తులు, ఆచరించేవన్నీ తప్పుడు పద్ధతులని గతంలో ఎంపీలు, ఎమ్మెల్యేల పార్టీల ఫిరాయింపులు చూసేవాళ్ల మని ఇప్పుడు ఏకంగా మోదీకు నచ్చ ని పార్టీల విలీలనాలు కొనసాగుతు న్నాయని సీపీఐ పార్టీ జాతీయ కార్య దర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ పార్టీ 3 రోజుల రాజకీయ వైజ్ఞానిక శిక్షణా తరగతులు ఉరవకొండలో దేవాంగ కళ్యాణ మండపంలో సోమవారం ప్రారంభంకాగా తొలి రోజు ఆయన ప్రధాన వక్తగా హాజరు కాగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, జిల్లా కార్యదర్శి పి.నారాయణ స్వామి, సహాయ కార్యద ర్శులు సి.మల్లికార్జున, జె.రాజారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి ఎం.బి.చెన్న రాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జె.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. తొలుత పార్టీ సీనియర్ నాయకులు గెన్నే మల్లేసి పార్టీ జండాను ఆవిష్కరించగా అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన శిక్షణా తరగతుల్లో కె.రామకృష్ణ మాట్లాడారు. దేశంలో రాజకీయాలు నేడు చాలా ప్రమాదకరమైన పద్దతుల్లో ఉన్నాయ న్నారు. ఎన్నికల్లో గెలవడానికి, ఆపై అధికార ంలోకి రావడానికి వందలు, వేల కోట్లను బీజేపీ వెదజల్లుతుండగా తమకు నచ్చని పార్టీలను విలీనాలను ప్రోత్స హిస్తున్నారన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీలోని మెజార్టీ ఎంపీలను తమ పార్టీలోకి కలుపుకోవడం, శివసేనను చీల్చి ఎన్డీఏ వైపునకు మళ్లించుకోవడం, పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతరం టీఎంసీ ఎంపీలు 20 మందిని, ఆ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలను ఊరు పేరులే ని పేపర్ పార్టీ ఎన్‌సీపీఐ లోకి విలీనం చేయించడం చూస్తున్నామన్నారు. ప్రజాస్వా మ్యానికి ఎన్నికలు గుండెకాయ లాంటిదని మోదీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని వాపోయారు. బీహార్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సభ్యత్వం కోసం నామినేషన్ దాఖలు చేస్తే తిరస్కరించేలా చేశారన్నారు. లక్షల ఓట్లను తొలగించడం, అ క్రమ పద్దతుల్లో అధికారంలోకి రావడం మోదీకు తెలిసిన రాజకీయం అన్నారు. అయోధ్య రామమందిరం నిర్మాణాల్లో కూడా 5వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఇటీ వలే బయటకు వస్తోందన్నారు. మోదీ దేశాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాళ్లదగ్గర పెడుతున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో మోదీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుండి దేశాన్ని కాపాడా లని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిం చాలని, రైతులను ఆదుకోవాలన్న నినాదా లతో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 6వ తేదీ నుండి 15 వరకు దేశవ్యాప్త పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలు, సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి భారీ ర్యాలీ చేపడుతున్నామన్నారు.

**చంద్రబాబు ఎన్నికల హామీలను తుంగలో తొక్కారు :**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలను తుంగలో తొక్కారని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయమంటే యోగాంధ్ర కార్యక్రమంలో రామ్‌దేవ్‌బాబాతో కలిసి ఆసనాలు వేసి ప్రతి ఊళ్లో ఒక యోగా కేంద్రం ఏర్పాటు చేస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. 76 సంవత్స రాల వయసు ఆయన యోగా, ధ్యానం చేయడం బాగుందికాని యువకుడు నారా లోకేష్‌తో బలవంతంగా చేయిండం బాగులేదన్నారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి డబుల్ ఇంజన్ సర్కార్‌లో ఆర్భికేలు నిరీర్యమయ్యాయని, వాలంటీర్లకు 10వేల జీతంతో కొనసాగిస్తామన్న హామీ, నిరుద్యోగ భృతి 3వేలు, ఉద్యోగులు, మహిళలు, రైతులకిచ్చిన ఏఒక్క హామీ నెరవేరలేద న్నా రు. యోగా కేంద్రాల ఏర్పాటును తాము తప్పుపట్టడం లేదని ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చమని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా నాయకులు ఎం.వి.సంజీవప్ప, పి.రామకృష్ణ, పద్మావతి, నారాయణస్వామి, గోపాల్, శ్రీరాములు, రమణయ్య, లింగమయ్య, నాగా ర్జున, నరసింహులు, రమణ, ఉరవకొండ నియోజకవర్గ పార్టీ బాధ్యులు నాగే ంద్ర, సుల్తాన్, రామాంజినేయులు, బసవరాజు, సూర్యానారాయణ, ఏఐ ఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు చందు, హాసేన్ తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల ప్రధాన సమస్యలపై మంత్రితో సమావేశం



మంత్రి పయ్యావుల కేశవ్‌ను సన్మానిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల ప్రధాన సమస్యలపై వాణిజ్య పన్నుల నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భవనారి వెంకటేష్ బాబు సంఘ సభ్యులతో కలిసి ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ని అనంతపురంలోని వారి స్వగృహంలో కలిసి విస్తృతంగా చర్చించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం వినతి మేరకు "ఆర్డర్ టు సర్వ్" విధానంలో ఇతర డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగులను వారి పేరెంట్ డివిజన్లకు తిరిగి పంపించడం ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి తెలిపినట్లు వారు తెలిపారు. అలాగే, అర్హత కలిగిన ఆఫీస్ సబార్డినేట్స్, రికార్డ్ అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా డైరెక్ట్ రిక్రూట్మెంట్, ఖాళీలలో తాత్కాలిక, పదోన్నతులు కల్పించాలనే సంఘం విజ్ఞప్తిపై మంత్రివర్యులు సానుకూలంగా స్పందిం చారు. అదేవిధంగా, రాష్ట్ర పన్నుల శాఖలో విధులు నిర్వహిస్తున్న జీఎస్‌టిఓలు ప్రోపర్ ఆఫీసర్ హోదాను గుర్తించి, తగిన జీఎస్‌టి అసెస్‌మెంట్ అధికారాలు కల్పించాలనే సంఘం డిమాండ్‌ను కూడా వారి దృష్టికి తీసుకెళ్లగా, అందుకు మంత్రి సాను కూల స్పందించినట్లు వారు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఓపికగా ఆలకించి, వాటి పరిష్కారానికి సానుకూల హామీ ఇచ్చిన మంత్రి వాణిజ్య పన్నుల నాన్‌గెజిటెడ్ ఆఫీ సర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలి యజేశారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, శాఖాభివృద్ధి కోసం మన సం ఘం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్య క్షులు భవనారి వెంకటేష్ బాబు తెలిపారు.

# పల్స్ పోలియోఖిను విజయవంతం చేయండి - జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్




అధికారులను ఉద్దేశించి మాట్లాడు తున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, జూన్ 22, ప్రభాతవార్త

అధికారులందరూ సమన్వయంతో, సమిష్టిగా పనిచేసి జిల్లాలో "పల్స్ పోలియో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పీజీఎస్ హాలు నందు పల్స్ పోలియో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 28 న జిల్లాలోని ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఇందుకో సం జూన్ 27 నుండి 30 వరకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. ఆదివారం అయినప్పటికీ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పోలియో బూత్‌లుగా ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రయాణాల్లో ఉండే పిల్లల కోసం ట్రాన్సిట్ బూత్‌ల వద్ద ఉదయం పూట బస్సులను కొద్దిసేపు ఆపి, పల్స్ పోలియో సిబ్బంది చుక్కలు వేసేలా సహకరించాలని సూచించారు. జూన్ 27న గ్రా మాల్లో టామ్ టామ్ (దండోరా) ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మౌ ర్య భరద్వాజ్, డీఆర్ఓ కొండయ్య, ఎస్‌డిసి విజయ కుమారి, డీఆర్డీఏ పీడీ నరస య్య, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజా బేగం, ఇన్చార్జ్ డీఐఓ డాక్టర్ చెన్నా రెడ్డి, డీపీహెచ్ ఎన్ఓ వీరమ్మ, ఎస్ఓ కళాధర్, ఐసీడీఎస్ పీడీ ప్రమీ లమ్మ, డీపీఓ సమత, సీహెచ్ ఓ వన్నప్ప మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి పిటిషనర్ కు న్యాయం చేయాలి - పోలీస్ పీజీఆర్ఎస్ కు 126 పిటిషన్లు - జిల్లా ఎస్పీ



పిటిషనర్ల సమస్యలను శ్రద్ధగా వింటున్న జిల్లా ఎస్పీ జగదీష్



హాజరైన బాధితులు

అనంతపురం క్రైమ్ జూన్ 22 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ శాఖ సాంకేతికతను విరివిగా వినియోగిస్తోంది. ప్రజా సమస్యల పరి ష్కార వేదికైన పోలీస్ పీజీఆర్ఎస్ లో బాధితులకు మరింత సుల భంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు వీలుగా సరికొత్త ి. ప్రజావాణి విధానాన్ని అమలు పరిచారు. ఈక్రమంలో స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఇవాళ జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి మొత్తం 126 పిటిషన్లను ఎస్పీ స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు తక్షణ పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్య క్రమ ప్రత్యేకత ఏంటంటే.. తమ సమస్యలను లిఖితపూర్వకంగా రాయలేని అర్జీదా రుల కోసం ప్రయోగాత్మకంగా ప్రవేశపె ట్టిన ి. ప్రజావాణి అద్భు తమైన ఫలి తాలను ఇచ్చింది. ఈ సరికొత్త ి. వ్యవస్థ ద్వారా కేవలం మాటల రూపంలో సేకరించిన వివరాలతో 10 పిటిష న్లను చట్టబద్ధ మైన ఫార్మాట్‌లో సిద్ధం చేశారు. ఇలా డిజిటల్‌గా త్వరితగతిన తయారైన 10 అర్జీలను బాధితులు నేరుగా ఎస్పీకి సమర్పించగా, ఆయన వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి తక్షణ పరిష్కారానికి మార్గం సుగమం చేశారు. బాధితులు చదువుకోని వారై నా లేదా తమ సమస్యను లిఖితపూర్వకంగా రాయలేక పోయినా. ి. ప్రజా వాణి వ్యవస్థ వారి మాటలను స్వీకరించి, అత్యంత ఖచ్చి తమైన చట్టప రమైన అర్జీగా రూపొందించింది. ఈ పీజీఆర్ ఎస్ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.నాగభూషణం (పరిపాలన), ఎస్. మహబూబ్ బాషా, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



ప్రజలతో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్లు

అనంతపురం కలెక్టరేట్ జూన్ 22 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునరెడ్డి, కిరణ్మయి, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 751 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. ఇందులో అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులకు అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో వస్తున్న అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్జీలను ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ పెండింగ్ లేకుండా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి సత్వరమే పరిష్కారం చూపించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం చూపించరాదన్నారు. గడువులోపు అర్జీలను పరిష్కరించడం అత్యంత ముఖ్యమైనదని, గడువు తీరిన అర్జీలను ఎలాంటి పెండింగ్ ఉంచరాదని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ కు సంబంధించి ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో పాజిటివిటి శాతంలో మరింత పురోగతి వచ్చేలా చూడాలని, ఎపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ క్షేత్రస్థాయిలో రెండు, మూడు ప్రాంతాల్లో పర్యటించి విద్యుత్ సరఫరాపై తనిఖీలు చేయాల న్నారు. పెన్నా పరిధిలో ఉన్న ఇసుక రీచ్ లను అందు బాటులోకి తీసుకురావాలని డిడి మైన్స్‌ని ఆదేశించారు. ఇసుక అందుబాటులో ఉంచడంపై మానిటర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్పి డిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, ఆర్.అండ్ .బి ఎస్ఈ మురళీకృష్ణ, పశుసం వర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, డ్వామా పిడి సలీమ్ భాష, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, మైన్స్ డిడి ఆదినా రాయణ, హార్టిక ల్చర్ డిడి ఉమాదేవి, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, సిపిఓ అశోక్ కుమార్, డిటిసి వీర్రాజు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, జడ్పి సిఈఓ విజయలక్ష్మి, డిఆర్డీఏ పిడి శైలజ, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, హౌసింగ్ పిడి శైలజ, డిఎంహెచ్ఓ ఈబి.దేవి, డిసిఓ అరుణకుమారి, మెప్మా పిడి విశ్వజ్యోతి, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రమణ్యం, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, సెక్షన్ సూపరింటెండెంట్లు వసంతలత, యుగేశ్వరిదేవి, రియజుద్దీన్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# రైతుల ఆత్మహత్యలు కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనం

## - నియోజకవర్గ సమన్వయ కర్త డా.సాకే శైలజానాథ్



జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

శింగనమల, జూన్ 22 ప్రభాతవార్త

జిల్లాలో అప్పుల బాధలతో రైతులు ఆత్మహత్యలు, రైతుల సమస్యల గురించి సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజే సినట్లు మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సిపి శింగనమల సమన్వయ కర్త సాకే శైలజానాథ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా జిల్లాలో రైతుల ఆత్మహత్యలు, రైతుల సమస్యలు పెరిగిపోయాయని, రైతుల కుటుంబాలు ఒకవైపు ఆర్థికంగా కుప్పకూలిపోతుంటే మరోవైపు ప్రభుత్వం సమస్యలను గాలికి వదిలేసి ప్రచార ఆర్భాటాలకు పరిమితం అవుతోందన్నారు. రైతు ల ప్రాణాలు పోతున్నా స్పందించని ప్రభుత్వ వైఖరి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం అన్నారు. అన్నం పెట్టేరైతు ఈ రోజు అప్పులు బాధతో ఉరి వేసు కుంటున్నాడన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రోడ్డున పడ్డారని, వర్షాలు లేకపోయినా రైతే నష్టపోతున్నారు, వర్షాలు ఎక్కువైనా రైతే నష్టపోతున్నారు. కాని ప్రభుత్వం మాత్రం రైతుల సమస్య లను గాలికి వదిలేసిందని విమర్శించారు. ఎన్నికల సమయ ంలో రైతులకు ఎన్నో హామీ లు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా మర్చిపోయా రని, రైతు సంక్షేమం గురించి ఒట్టి మాటలు చెబుతు న్నారన్నారు. క్షేత్ర స్థాయిలో రైతన్న పరిస్థితి దారుణంగా తయారైం దని, ఒక రైతు చనిపోతే కేవలం ఒక వ్యక్తి మరణిం చడు, ఆ రైతు కుటుంబం మొత్తం అనాథ అవుతుంది. పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వె ళ్తుందని, అతటువంటి కుటుంబాలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవా లన్నారు. ఉదాహరణకు పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామంలో అరటి రైతు నాగ లింగమయ్య, మడుగు పల్లి గ్రామంలో రైతు చంద్రమోహన్, నార్పల మం డల కేంద్రంలో రైతు ఆదినారా యణలు అప్పుల బాధ తాళలేక తనువును చాలించారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని, పంట నష్టాలకు పూర్తి పరిహారం ఇవ్వాలని, సాగునీటి సమస్యను పరిష్కరించాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రైతు సమస్యలపై ప్రత్యేక జిల్లా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాల న్నారు. అనంతరం మాజీ పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య మాట్లా డుతూ.. ఈ రోజు మనం చాలా బాధా కరమైన అంశంపై మాట్లా డు తున్నా మని, దేశానికి అన్నం పెట్టే రైతన్న తన ప్రాణాన్ని తానే తీసుకోవాల్సి రావడం కంటే దురదృష్టకరం ఇంకోటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు నారా యణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, బొమ్మన శ్రీరామిరెడ్డి, తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, చామలూరు రాజగోపాల్, నగేశ్వర్‌రెడ్డి, శ్రీనివా సులు నాయక్, పార్టీ మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, పరందా మరెడ్డి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, యల్లారెడ్డి, పద్మావతి, బైపరెడ్డి, శివశంకర్‌రెడ్డి, వెంకట రాముడు, రామకృ ష్ణరెడ్డి, ఫణీంద్ర, హరి కృష్ణ, కాటమయ్య, పవన్‌కుమార్, భయన్న, ఆ పార్టీ నాయ కులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనుమతులు 7వ తరగతి వరకే..

## - అడ్మిషన్లు మాత్రం 8, 9 తరగతులకు..! - ప్రభుత్వ నిబంధనలకు తూట్లు..విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం..?

పుట్లూరు, జూన్ 22 ప్రభాతవార్త

పుట్లూరు మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధ నలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో ఉన్న నాలుగు ప్రైవేట్ పాఠశాల లకు ప్రభుత్వం నుంచి 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు సమాచారం. అయితే వాటిలో కొన్ని పాఠశాలలు 8, 9 తరగతులకు కూడా అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఉన్నత తరగతులను నిర్వహించడం విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధమని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులు కూడా పూర్తి వివరాలు తెలుసుకోకుండా తమ పిల్లలను ఈ తరగతుల్లో చేర్పి స్తున్నారని సమాచారం. భవిష్యత్తులో గుర్తింపు, పరీక్షలు, సర్టిఫికెట్ల విషయ ంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమ వుతోంది. అనుమతులు లేని తరగతులకు అడ్మిషన్లు చేపట్టడంపై సంబంధిత అధికా రులు ఇప్పటికైనా స్పందించి తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతు న్నారు. నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తీసుకోవ డంతో పాటు విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగు లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రా యపడుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# కార్పొరేట్‌కు కట్టబెట్టేందుకే ఆర్టిసి ప్రైవేటీకరణ యత్నాలు

## - వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి - ఆర్టిసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా




కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైసిపి ట్రేడ్ యూనియన్ నేతలు

అనంతపురం సిటీ, జూన్ 22 ప్రభాతవార్త

ఆర్టిసిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగానే ఆర్టిసిని ప్రైవేటీకరణ ప్రయత్నాలు జరుగుతున్నాయని వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి విమర్శించారు. ఆర్టిసి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట వైసిపి శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆర్టిసి ప్రైవేటీకరణ యత్నాన్ని తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి మాట్లాడుతూ.. వైసిపి హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టిసిని పరిరక్షించారన్నారు. అంతేకాక ఆర్టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు తీసుకొచ్చిన ఘనతను సాధించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్న నేపత్యంలో ఆర్టిసి రంగాన్ని ప్రైవేటీకరణ చేసేంఉదకు చేస్తున్న యత్నాలు దుర్మార్గ కరమన్నారు. ఆర్టిసి కార్మికులు ఎన్నో ఏళ్ల కష్టపడి సంస్థను కాపాడుకుంటూ వస్తున్నారన్నారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకు చంద్రబాబునాయుడు చేస్తున్న ప్రయత్నాలు అడ్డకుంటున్నామని ఆయన హెచ్చరిం చారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు ఆర్టిసిని పరిరక్షిం చాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి బిసి. రమేష్‌గౌడ్, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్రపాడు హుస్సేన్ పీరా, ట్రేడ్ యూనియన్ నగరాధ్యక్షులు మార్కెట్ ఖాజా, జిల్లా ఉపాధ్య క్షులు సంపంగి రామాంజినేయులు, అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, సైఫుల్లా బేగ్, నాయకులు నగేష్, నాగార్జున రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్, సాకే చిరంజీవి, రాజశేఖర్‌రెడ్డి, కుళ్లాయప్ప, మహ్మద్ హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి, సాకే రామాంజినేయులు, మన్సూర్, నిజాం, ప్రకాష్, సంగమేష్, వెంకటేష్, ఆటో వెంకీ, శివకుమార్, తేజా తదితరులు పాల్గొన్నారు.

# .డెఫ్ క్రీడా కారులు ఎంతో సమర్థతను కలిగి ఉంటారు

## - ఆర్డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ - ప్రారంభమైన జాతీయ స్థాయి డెఫ్ క్రికెట్ టోర్నీ



జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ, జూన్ 22 ప్రభాతవార్త

సాధారణ క్రీడాకారులకంటే డెఫ్ (చెవిటి) క్రీడా కారులు కూడా ఎంతో సమర్థతను కలిగి ఉంటారని ఆర్డిటి స్పోర్ట్స్, డెవలప్‌మెంట్ డైరెక్టర్ సాయి కృష్ణ పేర్కొన్నారు. ఆర్డిటి క్రీడా మైదానం వేదికగా జరుగుతున్న ఐడిసిఏ అండర్-19 టి-20 జాతీయ క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 26 వరకు జరగనున్న ఈ టోర్నీకి పది రాష్ట్రాల నుంచి క్రీడా కారులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి ఆర్డిటి స్పోర్ట్స్ కం డెవలప్‌మెంట్ డైరెక్టర్ సాయి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియన్ డెఫ్ క్రికెట్ కార్యదర్శి రోహన్ షైని, ఏపి డెఫ్ క్రికెట్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రఘులు ఆర్డిటి క్రీడా మైదానంలో ఇలాంటి క్రీడ పోటీలు నిర్వహిస్తుండటం పట్ల ఆయన అభినందించారు. ఎంతో ఏకాగ్రతతో సాధారణ క్రీడా కారులకంటే డెఫ్ క్రీడా కారులు మ్యాచ్‌లలో ప్రతిభను కనబరుస్తుతారని, వీరిని మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తొలిరోజు హర్యాన, ఢిల్లీ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. కార్యక్రమంలో ఏడిసిఏ కార్య దర్శి యుగంధర్‌రెడ్డి, టోర్నీ నిర్వాహన కమిటీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసంపై ఐదు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం ప్రారంభం



జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త బ్యూరో

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ అనంతపురం (జేఎన్‌టీయూఏ) ఆధ్వర్యంలో పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న "కృత్రిమ మేధస్సు-యంత్ర అభ్యాసం, అల్గారిథమ్స్, అనువర్తనాలు, ప్రాయోగిక శిక్షణ" అనే అంశంపై ఐదు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూఏ ఉపకుల పతి ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు మాట్లాడుతూ.. నేటి విద్యా వ్యవస్థలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపు చ్చుకొని విద్యార్థులకు అందించాలని సూచిం చారు. అలాగే, అధ్యాపకులు పరిశోధన, ఆవిష్కరణలు, డేటా ఆధారిత బోధన పద్ధతులపై దృష్టి సారించా లని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నత విద్యా ప్రమాణాలను పెంపొం దించడంలో ఎంతో దోహదప డతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెషీన్ లెర్నింగ్, డేటా ప్రీప్రాసెసి ంగ్, డీప్ లెర్నింగ్, కంప్యూట ర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, పరిశ్ర మలలో కృత్రిమ మేధస్సు అనువర్త నాలు వంటి అంశాలపై నిపు ణులు సిద్ధాం తపరమైన, ప్రాయోగిక శిక్షణ అందించను న్నారు. ఈ కార్యక్ర మానికి జేఎన్‌టీయూఏ అను బంధ, స్వయం ప్రతిపత్తి కళా శాలల నుండి పెద్ద సంఖ్యలో అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ డా.బండి రమేష్ బాబు, సహకన్వీనర్లు డా.ఎం. మల్లికా ర్జున రావు, డా.సి.మంజునాథ్, కార్యక్రమ సమన్వ యకర్త డా.సి.వీణతో పాటు అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ డా.పల్లె కిషోర్ ఆధ్వర్యంలో సంస్థ విద్యా, సాంకేతిక రంగా లలో నూతన ప్రమాణాలను నెలకొల్పుతూ, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను నిరంతరం ప్రోత్స హిస్తోందని నిర్వాహకులు తెలిపారు.